క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

నూతనకల్ : మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం హాజరవుతున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రూ.70లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 50లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

కరాటేతో ఆత్మరక్షణ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సూర్యాపేట : విద్యార్థులు చదువుతోపాటు కరాటే నేర్చుకొని ఆత్మరక్షణ పొందాలని ప్రిన్సిపల్ లావణ్య అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే ఛాంపియన్ షిప్‌లో జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు చెందిన 22మంది విద్యార్థులు ప్రతిభ కనబరచగా వారిని సోమవారం అభినందించి మాట్లాడారు. పాఠశాలకు చెందిన ఏడుగురు గోల్డ్ మెడల్, 10మంది సిల్వర్ మెడల్, ఐదుగురు బ్రాంజ్ మెడల్ పొందినట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్లకు చెందిన ఉప్పునూతల వెంకన్న ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు సీఐ బిక్కి గుర్వయ్య 50కేజీల బియ్యం పంపించారు. ఆ బియ్యాన్ని సోమవారం సీపీఎం కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, తొట్ల అచ్చయ్య, పెద్దింటి జాన్‌రెడ్డి, పోలెపాక నగేష్, సామ వెంకట్‌రెడ్డి, తొట్ల లింగయ్య, కూసు సైదులు, బాలగాని సోమయ్య, బాణాల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సోమవారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆనంద్‌భాస్కర్ మాట్లాడారు. 317 జీఓలో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, నూతన డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి దామెర శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నరేష్, ఉమారాణి, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి : రాఘవపురం సర్పంచ్, వార్డు సభ్యుల పదవి కాలం పూర్తయినందున సోమవారం పంచాయతీ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ మహేష్, గ్రామ కార్యదర్శి సరళ, అంగన్‌వాడీ టీచర్లు అమృత, ధనమ్మ, వీబీకే మంజుల, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకన్న, సోమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయంలో దావత్!

చివ్వెంల : సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండటంతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం అనంతరం దావత్ ఏర్పాటు చేసినట్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటే దావత్‌కు డబ్బులు చెల్లించాలని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకుల నుంచి అధికారులు డబ్బులు వసూలు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఆ డబ్బులతో ప్రజాప్రతినిధుల భర్తలకు, పురుష సర్పంచ్‌లకు స్థానిక తోటలో మద్యం ఏర్పాటు చేసినట్లు సోషల్ మీడియాలో కొంతమంది పోస్టు చేయగా.. వైరల్‌గా మారింది. ఈ విషయమై ఎంపీడీఓ లక్ష్మీని వివరణ కోరగా సర్పంచ్‌లకు పదవీకాలం ముగుస్తుండటంతో మండల సర్వసభ్య సమావేశం అనంతరం భోజన సదుపాయం ఏర్పా టు చేశామని, ఎవరి నుంచి డబ్బులు వసూలు చేయలేదని పేర్కొన్నారు.

నారాయణపురంలో వైద్యశిబిరం

చిలుకూరు : నారాయణపురంలోని ఎస్సీ కాలనీలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



చివ్వెంలలో మాట్లాడుతున్న జగదీష్ రెడ్డి


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు


బొప్పారంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

చివ్వెంల : గ్రామాల్లో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల పనితీరు అమోఘం అని కొనియాడారు. దేశంలో ఏ అవార్డులు ప్రకటించినా తెలంగాణకే వచ్చాయని అన్నారు. పట్టణాలతో పోటీపడేలా గ్రామాల అభివృద్ధి జరిగిందని తెలిపారు. పచ్చదనం పెంపొందించడంలో స్థానిక ప్రజా ప్రతినిధుల కృషి ఎనలేనిదని అన్నారు. ఈ సందర్భంగా మరో రెండు రోజుల్లో పదవికాలం పూర్తవుతున్న ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లను ఆయన సన్మానించారు.

సర్వసభ్య సమావేశం..

మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖల ఎజెండాలను చదివి వినిపించారు. పలువురు ప్రజాప్రతిధులు మాట్లాడుతూ తాము చేపట్టిన పనులకు బిల్లులు రాలేదని, వాటిని ఇప్పించాలని సభలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే బిల్లులు అందిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో మూతబడిన పాఠశాలలను తెరిపించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యావలంటీర్లను నియమించాలని పాండ్యానాయక్ తండా సర్పంచ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులందరికీ రుణమాఫీతోపాటు, రైతు బంధు చెల్లించాలని గుంపుల సర్పంచ్ రాంరెడ్డి సభలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ గోపి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చదువును అందరికీ చేర్చిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్

ఆత్మకూర్ (ఎస్) : చదువును అన్ని వర్గాల ప్రజల చెంతకు చేర్చిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి బొప్పారం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుర్తి యల్లయ్య, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకటనారాయణ, భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కొణతం సత్యనారాయణరెడ్డి, శ్రీరాములుమాదిగ, చంద్రారెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలమాత చర్చిలో ఉత్సవాలు


ప్రార్థనలు నిర్వహిస్తున్న మత గురువులు

భానుపురి : జిల్లా కేంద్రంలోని నిర్మలమాత చర్చి ఆధ్వర్యంలో సోమవారం నిర్మలమాత పేరు మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలకు నల్లగొండ విశ్రాంత పీఠాధిపతి గోవిందం జోజి, డాన్ బాస్కో స్కూల్ ప్రిన్సిపల్ రాయప్ప, విచారణ గురువు పసల మరియన్నతోపాటు మరో 15మంది గురువులు హాజరై సందేశమిచ్చారు. రాత్రి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి కౌన్సిల్ సభ్యులు ఎం.మరెడ్డి, కోక జోసఫ్, శ్యాం, బాలస్వామి, అజయ్, గంపల బాలయ్య, బాలరాజు పాల్గొన్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్ వెంకట్రావుకు ఫిర్యాదు చేస్తున్న డైరెక్టర్లు

దురాజ్‌పల్లి : నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతి, అక్రమాల విషయంలో చైర్మన్, సీఈఓలపై సమగ్ర విచారణ జరిపించాలని సంఘం డైరెక్టర్లు కోరారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేటలో జిల్లా కలెక్టర్ వెంకట్రావును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఇతర ప్రాంత రైతుల పేరుతో బిల్లులు తయారు చేసి ఐకేపీ ధాన్యం అమ్మినట్లు ఆ బిల్లులను చైర్మన్ అతడి బంధువుల ఖాతాలోకి మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు లక్షా 25 వేల బస్తాల ధాన్యం కొనుగోలులో గోల్‌మాల్ జరిగిందన్నారు. ఈ విషయంపై తాము గతంలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో డైరెక్టర్లు రమణారెడ్డి, హేమలత, రంగారెడ్డి, ముత్తమ్మ, వెంకయ్య, వల్లభరెడ్డి, సైదులు, శ్రీను, గంగరాజు తదితరులు ఉన్నారు.

దాడులు చేయించడమే ప్రజాస్వామ్యమా..


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు

సూర్యాపేట : సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని, సొంత పార్టీ కౌన్సిలర్‌పై దాడులు చేయించడమే ప్రజాస్వామ్యమా అని బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు విమర్శించారు. సోమవారం పట్టణంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్ రెడ్డిపై మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ అనుచరులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కౌన్సిలర్ నిఖిల దిలీప్ రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేయొచ్చు కానీ గండూరి పావని కృపాకర్ ఇంటి ఎదుట ధర్నా చేస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. శాంతియుతంగా గండూరి కృపాకర్ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న తమపై బీఆర్‌ఎస్ గుండాలు దాడికి పాల్పడ్డారని విమర్శించారు. సూర్యాపేటలో ఉద్యమకారులను నాయకులుగా ఎదగకుండా అణచివేసిన ఘనత ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిది అని అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్ని విధాలుగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. సొంత పార్టీ కౌన్సిలర్‌పై దాడి చేయించి పార్టీలో లేని కౌన్సిలర్‌ను పరామర్శించడం జగదీష్‌రెడ్డి నైజం అని విమర్శించారు. తమ ఆత్మగౌరవం, అభివృద్ధి కోసమే అవిశ్వాసం ప్రవేశపెట్టామన్నారు. 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ డబ్బులకు అమ్ముడుపోవడంతోనే ఈ తీర్మానంలో నెగ్గలేకపోయామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అసమ్మతి వర్గ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలి'


మాట్లాడుతున్న కౌన్సిలర్ పావనికృపాకర్

సూర్యాపేట : మేము డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి మేము సంతకం చేసింది వాస్తవమేనని, చైర్మన్ పదవి అగ్రకులాలకు ఇస్తామనడంతో అవిశ్వాసానికి దూరంగా ఉన్నామని తెలిపారు. తనపై కొండపల్లి నిఖిలా దిలీప్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. మేము డబ్బులు తీసుకున్నట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలని అన్నారు. బీఎస్పీ అధినేత ఒప్పందం ప్రకారం సంతకం చేశానని తెలిపారు. బీసీలకు న్యాయం జరగలేదు కాబట్టే అవిశ్వాసానికి దూరంగా ఉన్నామని తెలిపారు. ఇకనైనా అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

విద్యా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాసభల వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడాలని, ప్రభుత్వ పాఠశాలలకు నిధులు విడుదల చేసి మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు తుండోజు అన్నపూర్ణాచారి, దుర్గాప్రసాద్‌రెడ్డి, రఘు, భాస్కర్ రెడ్డి, నరసరాజు, వెంకటనారాయణ, విజయ్‌కుమార్, ఝాన్సీ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కోసం బారులు

- ఆప్డేట్, ఈ–కేవైసీ కోసం మీసేవ కేంద్రాల్లో కిక్కిరుస్తున్న జనం


తుంగతుర్తిలోని మీసేవా కేంద్రం వద్ద ఉన్న జనం

తుంగతుర్తి : మండలంలో ఆధార్ అప్డేట్ కోసం ప్రజలు మీ–సేవా కేంద్రం వద్ద బారులుదీరుతున్నారు. మండల కేంద్రంలో ఒకటే ఆధార్ కేంద్రం ఉండడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. గతంలో మండల కేంద్రంలో ఉన్న రెండు మీసేవ కేంద్రాల ద్వారా ఆధార్ సేవలు అందించేవారు. కానీ ప్రస్తుతం మండలంలోని ఒకే మీసేవ ఆధార్ అప్డేట్ అవకాశం ఇచ్చారు. దీంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో కూడా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలకు సరైన అవగాహన లేక మీ సేవ కేంద్రానికే అధికంగా వెళ్తున్నారు. దీంతో మీ సేవ కేంద్రం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కొన్ని సమయాల్లో సర్వర్ మొరాయిస్తుండటంతో మరింత ఆలస్యమవుతోంది.

పదేళ్లు దాటితే..

ఆహార భద్రత కార్డుల్లో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ రేషన్ దుకాణాలకు వెళ్లి వేలి ముద్రతో ఈ– కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్కడ వేలి ముద్ర పడనివారు ఆధార్ కేంద్రాల్లో ఈ–కేవైసీ అప్డేట్ చేసుకోవాలి. ఈ విషయం తెలియక చాలామంది ఆధార్ కేంద్రాల బాట పడుతుండటంతో రద్దీ పెరుగుతోందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



మా పిల్లల ఆధార్ నమోదు కోసం మీసేవ కేంద్రానికి మూడు రోజులుగా తిరుగుతున్న. అయినా ఆధార్ నమోదు కాలేదు. ప్రజల రద్దీ అధికంగా ఉంటుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరో మీసేవ కేంద్రంలో ఆధార్ సౌకర్యం కల్పిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– వగలగాని నవీన్, తుంగతుర్తి

మండల కేంద్రంలో ఉన్న మరో మీసేవ కేంద్రంలో కూడా ఆధార్ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం


పాఠశాలకు అందజేసిన పుస్తకాలు

నూతనకల్ : పుస్తక పఠనంతోనే విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని సర్పంచ్ చూడి లింగారెడ్డి అన్నారు. సోమవారం తాళ్లసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అప్‌గ్రేడ్ మై క్లాస్ రూమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు రూ. 40వేలు విలువ చేసే గ్రంథాలయ పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా అప్‌గ్రేడ్ మై క్లాస్ రూమ్ సంస్థ ప్రతినిధి రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తండు వెంకటనారాయణ, భిక్షం, మధుసూదన్‌రెడ్డి, దేవరాజు, వెంకటయ్య, సంధ్యారాణి, హన్మంతు, అనిత, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు


తుంగతుర్తిలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ బోయిని లింగయ్య


మద్దిరాల : గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు


పెన్‌పహాడ్ : విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి


అర్వపల్లి : విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయుడు

తుంగతుర్తి : విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పెల్ విజార్డ్స్, డ్రామా పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భాస్కర్, ఆంగ్ల ఉపాధ్యాయులు సురేందర్, కృష్ణవేణి, సంధ్య, పద్మ, పాలకుర్తి ఎల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం స్పెల్ విజార్డ్ పోటీలు, డ్రామా కాంపిటీషన్ నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, చిన్ననెమిలా జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, గోరెంట్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, కేజీబీవీ విద్యార్థులు కాంపిటీషన్‌లో పాల్గొన్నారు. స్పెల్ విజార్డ్‌లో జెడ్పీహెచ్‌ఎస్ గోరెంట్ల విద్యార్థి అంగిరేకుల శివతేజ, కేజీబీవీ నుంచి పూజిత, డ్రామా కాంపిటీషన్‌లో చిన్ననెమిల విద్యార్థుల బృందం, కేజీబీవీ విద్యార్థుల బృందం జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డి.వెంకన్న తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.రమేష్, బిక్కి రమేష్, హఠ్రున్, సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

పెన్‌పహాడ్ : విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో నాటక పోటీలు, ఆంగ్ల భాష పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో నాటక పోటీల్లో పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆంగ్ల భాష పోటీల్లో చీదెళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. నాటకం, ఆంగ్ల పోటీల్లో గురుకుల పాఠశాల విభాగంలో సింగారెడ్డిపాలెం బీసీ గురుకుల పాఠశాల మండల స్థాయిలో ప్రథమ స్థానం గెలుపొందిపాటు జిల్లా స్థాయికి ఎంపికైంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రిష్ణప్రసాద్, కరుణశ్రీ, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : విద్యార్థులు ఆంగ్ల భాషపై అవగాహన పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి రాములు నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పెల్ విజార్డ్, నాటక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. స్పెల్ విజార్డులో తాళ్లసింగారం పాఠశాలకు చెందిన ఎం. పవన్‌సూర్య, పెదనెమిల పాఠశాలకు చెందిన జి. జాహ్నవి, డ్రామా విభాగంలో పెద నెమిల పాఠశాలకు చెందిన జి గణేష్, జి. జాహ్నవి, మనీషాలు ప్రతిభ కనబర్చడంతో వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టా మండల కన్వీనర్ సిద్ధిక్‌పాషా, కో కన్వీనర్ చవగాని వెంకటయ్యగౌడ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్పెల్ విజార్డ్ పోటీలో తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని గుండగాని స్పందన ప్రథమ బహుమతి గెలుచుకుంది. దీంతో తిమ్మాపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్పందనను ఉపాధ్యాయ బృందం అభినందించింది. అలాగే ఈ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వర్దెల్లి కృష్ణయ్య విద్యార్థినికి రూ.1000 నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు చాంప్లానాయక్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం


నాగారం : మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న చల్లా తేజ

తుంగతుర్తి : పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రావులపల్లి, మానాపురం గ్రామాల్లో క్రీడాకారులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం రావులపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మల్లయ్య కుటుంబాన్ని, ఏనకుంట తండాలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి మృతి చెందిన అమృ కుటుంబాన్ని పరామర్శించి, వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, నాయకులు పసుల అశోక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి

నాగారం : టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ అన్నారు. సోమవారం పసునూర్ జెడ్పీహెచ్‌ఎస్, మోడల్‌స్కూల్ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమన్న, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.వలీ, ప్రిన్సిపల్ కుంట రమేష్, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి...

యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ అన్నారు. సోమవారం పసునూర్‌లో ఆజాద్ యూత్ సభ్యులకు, శాంతినగర్‌లోని యూత్ కాంగ్రెస్ సభ్యులకు క్రికెట్ కిట్లను బహూకరించారు. శాంతినగర్ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు షేక్.కరీం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు.

మద్దిరాల : ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ అన్నారు. కుక్కడం గ్రామానికి చెందిన గొండ్యాల కొమరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సోమవారం మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన యూత్ క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల భిక్షపతి, మాన్‌సింగ్, గోవర్ధన్, మద్దెల రాములు ముక్కాల నాగరాజు, అనిల్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

జంతువుల పట్ల ప్రేమతో ఉండాలి


ఫణిగిరిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

నాగారం : మనుషులు జంతువుల పట్ల ప్రేమ, జాలి కలిగి ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డి.శ్రీనివాస్‌రావు అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా జంతు సంక్షేమ సంస్థ, పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణి వెంకన్న, సర్పంచ్ గట్టు నర్సింహారావు, పశువైద్య, సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రవిప్రసాద్, మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి, ప్రధానోపాధ్యాయుడు నారాయణ, హేమమాలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

తిరుమలగిరి : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిరుమలగిరి మండల పరిధిలో చోటు చేసుకుంది. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన కిరణ్‌రెడ్డి ఆదివారం పని నిమిత్తం బైక్‌పై మున్సిపల్ కేంద్రానికి వచ్చాడు. అక్కడ పని ముగిసిన తర్వాత రాత్రి సమయంలో అతడు తన స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో రోడ్డు పైన తీసిన పెద్ద గుంతలో బైక్ అదుపుతప్పింది. దీంతో అతడు కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

ముగిసిన స్నూకర్ పోటీలు

కోదాడ : మూడు రోజులుగా కోదాడలోని మదార్ స్నూకర్ పాయింట్‌లో నిర్వహిస్తున్న కోదాడ నియోజకవర్గ స్థాయి స్నూకర్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతిని వెంకట్, ద్వితీయ బహుమతి నజీర్ మీర్జా, తృతీయ బహుమతి కిరణ్ గెలుచుకున్నారు. వీరికి 9వ వార్డు కౌన్సిలర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు ఎస్‌కే.ఫిరోజ్, బుర్ర సైదులు, కోటమర్తి విద్యాసాగర్, కంచుకొమ్ముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ


రవీందర్, పెన్‌పహాడ్


వెంకట్ రెడ్డి, చివ్వెంల


మహేందర్ నాథ్, జాజిరెడ్డిగూడెం


మద్దిరాల ఎస్‌ఐ మధును సన్మానిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : మండల నూతన ఎస్‌ఐగా పి.రవీందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన వెంకన్నగౌడ్ సూర్యాపేట సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్‌ఐ రవీందర్‌కు సిబ్బంది పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు.

చివ్వెంల : చివ్వెంల మండల ఎస్‌ఐగా బి.వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ విష్ణుమూర్తి బదిలీపై సూర్యాపేట డీఎస్పీ ఆఫీస్‌కు వెళ్లారు. వెంకట్ రెడ్డి హైదరాబాద్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐకి స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ విష్ణుమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రాములు, సిబ్బంది సాలయ్య, లింగయ్య, హరిలాల్, రవీందర్, శ్రీధర్, సైదులు పాల్గొన్నారు.

మద్దిరాల ఎస్‌ఐ మధుకు సన్మానం

మద్దిరాల : మద్దిరాల నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన మధును కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ము వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల నూతన ఎస్‌ఐగా ఇందనూరి మహేందర్ నాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను సూర్యాపేట 1టౌన్ ఎస్‌ఐ గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న బి.అంజిరెడ్డి సూర్యాపేట వీఆర్‌కు బదిలీ అయ్యారు.